తెలుగు నాడి : నవంబర్ 2005

# బృంద

మబ్బు పట్టినాకాశం... ఈదురుగాలిలో తేలివస్తూన్న వాన పరిమళం...

గుండెల్నిండా చెమ్మ నిండిన గాలిని పీల్చుకున్నాను...

పరిచిత గత ఖేదం... ఎప్పటికో ఘనీభవించింది... కరిగి గుండెల నిండా నిండిన చెమ్మ గాలితో చేరి... కళ్లల్లోకి చేరుకుంది... కరెంటు పోయింది...

వెలుగుతున్న కొవ్వొత్తి శిఖ రెపరెపలాడుతోంది... గది చీకటి నలుపుదనాన్ని పలుచబరచడానికి లేత బంగారు కాంతి బలహీనంగా ప్రయత్నిస్తోంది.

గోడకు వేళ్ళాడ్తోన్న ఫయ్యూం... ఘనీభవించిన చిర్నవ్వుతో... ఎందుకెళ్ళిపోయావ్ ఫయ్యూ... నన్నొంటర్ని చేసి...

ఎట్లా లాగనీ జీవితాన్ని...?

టేబిల్మీద చేతులు మడిచి వాటి మీద తల పెట్టుకుని కళ్లార్పకుండా... ఆ బంగారు కాంతిలో మసగ్గా కనిపిస్తోన్న ఫయ్యూం ఫోటోను చూస్తున్నా...

ఇంత వంటరితనంలో...

జ్ఞాపకమై వేళ్ళాడ్తోన్న ఫయ్యూం ముఖం గోడమీద...

ఎంత ఊరట...!

"మా!" బృంద గావుకేకతో ఉలిక్కిపడ్డాను.

తబ్బూ పరుగెత్తుకొచ్చి నా చేయి పట్టుకుని నించుంది...

దాన్ని తరుముతూ బృంద వగరుస్తూ... వచ్చి నుంచుంది.

తబ్బూ వేపు చూపుడువేలుతో చూపుతూ బృంద...

ఇద్దర్నీ రెండు చేతుల్తోటీ విడదీస్తూ అడిగా...

"ఏవిటీ ఏం చేశావ్ మళ్ళీ?"

"దాని పెట్టి నిండా మట్టిమట్టిగా ఉందమ్మా... ఆ బురద బొమ్మోటి పగిలిపోయింది. నే తీస్తుంటేనేమో... మట్టి కదా... అందుకని... 'తీకు తీకు' మని

తోస్తోంది. చెప్పు మా పెట్టినిండా మట్టయింది... ఇంకా ఉన్నాయి ఆ బురద బొమ్మలు..."

"దాని పెట్టి దానిష్టం... దాని జోలి నీకెందుకు చెప్పు... వద్దన్నానా.... బృందా దామ్మా... మట్టి కదా అందుకని తీస్తోంది చెల్లి... నీ పెట్టెలో బొమ్మలేం తీయదులే."

ఇద్దర్నీ దగ్గరికి తీస్కున్నా...

ఆ చీకట్లో... వస్తూన్న ఈదురుగాల్లోంచీ... ఫయ్యూం నవ్వు తరంగాల్లా కలిసొచ్చినట్టు...

ఫయ్యూం ఫోటో వంక చూసా... దానికున్న గాజు పలకలో బృంద ముఖం కొవ్వొత్తి వెలుగులో... ఫయ్యూం మసక ముఖమ్మీద గాజుపలకపై బృంద ప్రతిబింబం... రెండూ మసక మసగ్గా అలుక్కుపోయి... మళ్ళీ దేనికది విడివిడిగా...

దగ్గరికి లాక్కుని ఇటు తబ్బు అనే తబుస్సుంనీ అటు బృందనీ నిండుగా కావలించుకున్నా...

బృంద నన్ను విడిపించుకుని తెరిచుంచుకున్న తన పెట్టి దగ్గరికెళ్ళి కూచుంది.

"ఈ బురద బొమ్మలు పగిలిపోతాయమ్మా... చెప్పు... అదింటంలే... దానెద్దుకి కాళ్ళూ, కొమ్ములూ తోకా అన్నీ విరిగిపోయాయి... మిగిల్న బొమ్మలు కూడా విరిగిపోయాయి... అసలు దానికి బొమ్మల్చెయ్యటం రానేరాదు... చూడు చూడు... విరిగిపోయినెద్దుతో ఎట్లా ఆడుకుంటోందో," తబ్బు రహస్యంలాగా అంది.

నెమ్మదిగా లేచి బృందవేపు కదిలా.

మడిచిన న్యూస్పేపరు మీద ముక్కలు ముక్కలుగా విరిగిన మట్టెద్దుని ఒక్కో భాగంగా తీసి మళ్ళీ ఓ ఆకారంలోకి తీసుకురావటానికి యత్నిస్తోంది బృంద...

ఓ నిముషం తర్వాత...

విరిగిన ఆ మట్టెద్దుని ఓ ఆకారంలోకి సర్దింది బృంద...

"ఛీ... రాలే," గట్టిగా అనేసింది తబ్బు.

ఒక్కసారి తలెత్తి తన వెనక నించున్న మావంక కళ్ళు విప్పార్చి కింది లావాటి పెదవిని నోట్లో కరుచుకుని చూసింది బృంద...

కొవ్వొత్తి బంగారు కాంతి బృంద ముఖాన్ని ముక్కలు ముక్కలుగా చూపుతోంది... విశాలంగా వికసించిన బృంద కళ్ళనిండా నీళ్ళు నిండుకున్నాయి... మట్టెద్దు విరిగిన బాధ ఓ వేపు... విరిగిన మట్టెద్దు విడిభాగాలు కుదరక వంకర టింకరగా మిగిలిన ఆ బొమ్మ బాధ ఇంకోవేపు... అన్నీ కలగలిశాయి బృంద కన్నీళ్ళలో... మళ్ళీ తలదించుకుని... ఆ విరిగిన మట్టెద్దు విడిభాగాల్ని ఒక్కోటి పెట్టెలోకి చేర్చసాగింది.

మౌనంగా అక్కడ్నుంచీ కదిలి వెనక్కొచ్చా తబ్బుని పట్టుకుని...

పన్నెండేళ్ళొచ్చినా ఇంకా అయిదేళ్ళ పాపే బృంద... ఏదీ త్వరగా గ్రహించలేదు...

మూడోఏట వైరల్ ఎన్‌సెఫలైటిస్ సోకి... శారీరకంగా కోలుకున్నా, మానసికంగా ఎదుగుదల పూర్తిగా మందగించింది బృందకు...

నేనక్కడే ఉంటే నన్నూ తబ్బూనీ చూసి ఉక్రోషంతో ఇంకా ఏడుస్తుంది... అందుకని అక్కడ్నుంచి వచ్చేశా...

"పారేయమనూ మా... విరిగిపోయింది కదా ఎద్దూ... అంతా మట్టి మట్టీ," మళ్ళీ రహస్యంగా అంది తబ్బూ...

"ష్!" అన్నట్టు నోటి మీద వేలు పెట్టుకుని దాన్ని వారించా...

అది కూడా పెద్ద అర్థమయినట్టు నోటి మీద వేలేట్టుకొని తలాడించి "విరిగిపోయింది కదా," అంది మళ్ళీ రహస్యంగా గాలితో మాట్లాడ్తూ...

నవ్వొచ్చింది... నవ్వును వెన్నంటే ఏడుపొచ్చింది...

నవ్వుతూన్న ఫయ్యూం ఫోటోని చూడగానే కోపమొచ్చింది...

నా కళ్ళలో మార్పు గ్రహించి తబ్బూ చిన్నగా నాచేయి వదిలి దూరంగా గోడకానుకుని పుస్తకాల సంచీ ముందు గొంతు కూచుని రెండు చేతుల్లో మొహం ఉంచుకుని కళ్ళు సగంమూసి నన్నే చూస్తోంది... బృందకేసి చూసా...

తన ప్రపంచమైన ఆ పెట్టెని మూసేసి... దానిమీద చేయి వేసి కిటికీలోంచి చీకటి ప్రపంచాన్ని శూన్యం నిండిన కళ్ళతో చూస్తోంది... తనకిప్పుడు నేనూ తబ్బూ లేము...

తనకైతనే ఏదో అర్థంకాని భావం... ఆ కళ్ళలో... మనస్సు కకావికలు... ఆలోచనలు శత సహస్రాలుగా చిట్లిపోయి...

ఏమీ తెలియనితనంలోకి ఏమి కానితనంలోకి ప్రయాణించడం ఎంత కష్టం! ఎంత అద్భుతం!

ఆ ముఖంలో కళావతి వాయిస్తూ వాయిస్తూ చటుక్కున ఆపేసి మోగిస్తున్న వేణువును గాల్లోకి విసిరేసి పట్టుకునే ఫయ్యూం, 'ఈ రాతిబల్ల మనకోసం ఈ ప్రకృతి ఎన్ని కోట్ల సంవత్సరాలు కష్టపడి చేసిదో కదా...' అన్న అతని నగ్న శరీరపు ఉద్వేగ్నపు వెచ్చదనం స్ఫురించింది. అలసిన ఆ తరువాత ఫయ్యూం కళ్ళ కాంతిలో తడిసిపోయిన ఆ పురాతన శిలా రహస్యం... ఇపుడు బృంద కళ్ళ భావరాహిత్యంలో జీర్ణమైపోయినట్టు...

రాలిపోయిన ఎండుటాకుల కుప్పపై వెల్లకిలా పడుకుని తెల్లటి లాల్చి కుర్తాలో ఫయ్యూం... కాళ్ళు పైకెత్తి మూడేళ్ళ బృందని కాళ్ళపై ఉంచుకుని పైకెత్తితే... కేరింతలు పెట్టిన బృంద గొంతుకలో విచ్చుకున్న ఆకుపచ్చని చెట్ల రహస్యగానం... మళ్ళీ వింటున్నట్టు...

ఈదురుగాలికి కొవ్వొత్తి రప్పున ఆరిపోయింది.

"మా!" బృందా, తబ్బా ఇద్దరూ ఒకేసారి చిన్నగా కేక పెట్టారు...

కొవ్వొత్తిని మళ్ళీ వెలిగించా... టేబిల్మీద పెట్టుంచిన చిన్న ప్లాస్టిక్ ప్లేట్లో కరిగి కరిగి రెండంగుళాలు మాత్రం మిగిలిన కొవ్వొత్తి... చుట్టూరా కరిగి, కారి కారి ఘనీభవించిన మైనం... మీనియేచర్ పాలరాతి కొండలా ఉంది.... అందులో రకరకాల ఆకృతులు...

రెండు దీపపు పురుగులు రెపరెపలాడ్తోన్న కొవ్వొత్తి మంట చుట్టూ... ఓ పురుగు చటుక్కున కాలి, రాలి కరిగిన మైనంలో పడి కాస్సేపు అటూ ఇటూ కదిలి నిశ్చలమైంది.

గోడ మీది ఫయ్యూం ఫోటోవేపు అప్రయత్నంగా చూశా...

"మా! అం," బృంద వెనక నించీ రెండు చేతుల్తో కావలించుకుని అడిగింది... గోడ కానుకుని పుస్తకాల సంచీ ముందు గొంతుకూచున్న తబ్బా కూడా ఆకలన్నట్టు తలూపింది.

బృంద చేతులు విడిపించుకుని లేచా...

కరెంటొస్తే బావుణ్ణు అనుకున్నా... ఉదయం వంటకి అన్నీ సిద్ధం చేసుకోవాలి. రేపు బృంద స్కూలుకెళ్ళాలి. రమ్మని స్కూలు కరస్పాండెంట్నించి పిలుపొచ్చింది... వాళ్ళుకూడా దాన్నింటికి తీసుకెళ్లమంటారని తెలుసు... ఏం చేయను? దానికి రావడమైతే పన్నెండేళ్ళొచ్చాయి... తెలివి? ఇప్పటికీ చిన్నచిన్న పదాలూ, వాక్యాలూ మాత్రం రాయడమొచ్చింది. ఆఫీసుకి దగ్గర్లో ఏస్కూలూ లేదు... ఊరికి అటువేపు బృందలాంటి పిల్లల కోసం ఓ స్కూలుంది. కానీ దాన్నెలా అక్కడ పంపించి చదివించడం. ప్చ్! బృంద వేపు దిగాలుగా చూశా...

లంగా కుచ్చిళ్ళలోని ఓ మడతని కుడిచేతి చూపుడువేలూ బొటనవేలూ మధ్య ఉంచి... సాపు చేస్తోంది. వేగంగా కళ్ళు ఎదురుగా గోడవైపు శూన్యంగా చూస్తున్నాయి.

చేతిలో లంగా మడత... వేగంగా చేయి ఆ మడతని సాపు చేస్తో...

డాక్టరేదో పేరు చెప్పాడు అలా పదేపదే చేయడం గురించి... దిగులెక్కువైంది. బ్రతకటానికీ, ఈ పసికూనలిద్దర్నీ బ్రతికించడానికీ కనీసం ఉద్యోగమైనా ఉంది... తాతయ్య మిగిల్చి వెళ్ళిన ఈ చిన్న కొంప గూడులా ఉంది...

స్కూలు కరస్పాండెంట్ని రిక్వెస్ట్ చేయాలి... ఆవిడేదో మెహర్బానీ చేస్తున్నట్టు... అసహ్యంగా దేబిరించాలి... ఆ కరస్పాండెంట్ మొహం గుర్తొచ్చి ఒక్కసారిగా బృంద మీద కోపమొచ్చింది...

నామీద నాక్కూడా...ఫయ్యూమ్మీద ఇంకా...

"మా! ఆమ్," బృంద గొంతు ప్రపంచంలోని అమాయకత్వాన్ని సొంతం పీల్చేసుకుని...

దానివేపు చూసా... పదిహేను పదహారేళ్ళ పిల్లలా శరీరం ఎదిగింది... కానీ?!... ... ఆ స్పృహ దానికస్సల్లేదే? ఎన్ని వికారపు చూపులు దీని శరీరాన్ని నాకాయో?

ఒళ్ళంతా గొంగళి పురుగులు పాకినట్లయింది... తల విదుల్చుకున్నా... నా తల విదిలింపుకన్నట్టు కరెంటొచ్చింది... పిల్లల్తో సహా ఆ వెలుక్కి కళ్ళు చిట్లించా...

తబ్బు... "అయ్," అంది...

బృంద నోరంతా తెరచి పళ్ళన్నీ బైటపెట్టి నిశ్శబ్దంగా నవ్వింది.

ఓ క్షణంపాటు లంగా మడతని సాపు చేస్తున్న చేయి ఆగింది... తబ్బూ ఓ గెంతు గెంతి టేబిల్మీది కొవ్వొత్తిని 'ఉఫ్'మని ఊది ఆర్పేసింది. చిన్న మిణుగురులా కొవ్వొత్తి చివర నిప్పు... పైకి పొగ విచిత్రమైన ఆకృతుల్లో... కొవ్వొత్తి ఆరిన వాసన...

ఆ పొగని చూపుడువేలితో చెరిపేస్తున్నట్టు అటూ ఇటూ... తబ్బు... తబ్బూ... తబ్బస్సుం ... చిర్నవ్వు...

అప్రయత్నంగా నాపెదవులు విచ్చుకున్నాయి.

చాలు చాలు... వీళ్ళిద్దరూ ఉంటే ఈ ప్రపంచం యావత్తునీ జయించగల్నని పిస్తుంది. పిల్లలిద్దరికీ అన్నాలు కలిప్పెట్టి నేనో రెండు ముద్దలు తిని రేపటిని ఎదుర్కోవడానికి సిద్దపడుతూ లైటార్పి నడుం వాల్చా...

★ ★ ★

ఏదో బస్సులో ప్రయాణిస్తున్నా... వెచ్చగా ఉన్ని దుప్పటి రంగురంగుల చిత్ర విచిత్రమైన డిజైన్లతో ఉంది. వంటి నిండా కప్పుకున్నా... బస్సు కదుల్తోంది... పరిచయం ఉన్నట్టుగా అనిపిస్తున్నవీ... అస్సలు పరిచయం లేనివి అయినా స్థలాలు చకచకా దాటి వెళిపోతున్నాయి...

ఉన్నట్టుండి బస్సాగింది... డోరు దగ్గర నుంచున్నా... అందరూ నన్ను తోసుకుంటూ దిగి వెళ్తున్నారు... ఫయ్యూం నాన్న నన్ను అసహ్యంగా చూస్తూ తోసుకు వెళ్ళాడు...

అమ్మ ముఖం లీలగా... అమ్మేనా... అమ్మా! పిలిచా... అవిడ ఆగకుండా దిగెళ్ళిపోయింది.

నన్నెవరో తోశారు... కిందున్నా... బస్సెళ్ళిపోయింది... దుమ్మురేగింది... ఆ ధూళి అంతరించేసరికి నా చుట్టూ ఎవ్వరూ లేరు. బస్సుతోపాటు దిగిన వాళ్ళందరూ లేరు. ఒక్కరు కూడా. నాముందు నిర్మానుష్యంగా ఓ ఇరుకు దారి...

ఇప్పుడు నాచేతుల్లో రెండు పెట్టెలు...

విపరీతంగా గాలి రేగింది... కప్పుకున్న రంగురంగుల ఉన్ని దుప్పటి ఎగిరింది

గాల్లోకి... అంధుకోడానికి ఎగిరా... అందలేదు. ఓ పెట్టెకింద దించి ఇంకో పెట్టెని చేతిలో ఉంచుకునే మళ్ళీ దుప్పటి అందుకోవడానికి ఎగిరా...

దుప్పట్ని గాలి చాలా ఎత్తుకు లేపేసింది... దూరంగా... చాలా... చాలా దూరంగా... కనుమరుగైపోయింది.

రెండు పెట్టెల్తో ఆయాసపడ్తూ నిర్మానుష్యంగా ఉన్న ఆ ఇరుకుదారిలో నడుస్తున్నా... ఉన్నట్టుండి ఓ వీధిలోకొచ్చా... అన్నీ తలుపులు మూసేసిన ఇళ్ళే... వీధి వీధి నిర్మానుష్యం...

ఎవర్నో ఎవరో తెలీని ఎవర్నో పిలుస్తున్నాను... నోరు పెగలదు... గట్టిగా అరిచినట్టుగా మళ్ళీ మళ్ళీ ఎవర్నో పిలుస్తున్నా... స్వరం రాదు... ప్రతి ఇంటి తలుపూ తడుతున్నా...

ఉన్నట్టుండి వీధి మాయం... దారి ఇంకా ఇరుగ్గా అయ్యింది. చేతుల్లో పెట్టెలు బరువెక్కుతున్నాయి. ఉన్నట్టుండి దారి ఆగిపోయింది...

కుడిచేతిలో పెట్టెని నెమ్మదిగా దించా... ఎడమచేతిలో పెట్టె చేతిలోంచి జారిపడి భళ్ళున తెరుచుకుంది. దాన్నిండా మట్టిబొమ్మలు... ఓ బొమ్మ మొహం పెద్దగా అయ్యి... 'మా... మా... మా,' అంటోంది.

ఉలిక్కిపడి లేచా...

బృంద...

ఒంటేలు పోసుకోందుకేమో... "మా! మా! మా!" అంటూ కుదుపుతోంది.

* * *

నూర్ రాక నన్ను నిద్ర లేపింది.

ప్రతీ ఉదయంలా చిరాకుతో లేవడమే అయ్యింది... విసుగ్గా టైం చూసుకున్నా... పావు తక్కువ ఆరు... ఆవులిస్తూ... జారిన వెంట్రుకల్ని ముడి వేసుకుని తలుపు తీసా...

నూర్ అనే నూర్‌బానో... ఎదురుగా, పాలప్యాకెట్లతో. బైట వాతావరణంలో పెద్ద మార్పేమీ లేదు. ఈదురుగాలులు వీస్తూనే ఉన్నాయి... వర్షం బాగా కురిసేట్టుగా ఉంది.

నూర్ నన్ను తప్పించుకుని లోపలికెళ్ళింది. బైటికోమాటు తొంగిచూసి మారోమాటు ఆవలించి యుద్ధానికి సిద్ధమైపోయా.

ఇప్పుడు లేపితేగాని పిల్లలిద్దరూ తయారవ్వరు... నాకే లేవడానికి బద్ధకం. ఇక పిల్లలా! ఇద్దరూ రగ్గుల్ని ముఖాల్నిండా లాక్కుని ఉండల్లా పడుకున్నారు... ఇద్దర్నీ కుదిపి కుదిపి లేపా...

బృందని ముందు శుభ్రం చేయాలి... దాన్ని చెయ్యిపట్టి లేపాను... ముక్కుతూ మూలుగుతూ ఇద్దరూ లేచి కూచున్నారు. తబ్బూ రగ్గుని తలమీంచి నిండుగా కప్పుకొని...

"ఊహూహూహూ... మా చలే," అంది.

ఓసారి జాలేసింది... కానీ తప్పదే...!

"లెండి లెండి," అని లేవగొట్టా...

"ఉండుండు నే ముందు నే ముందు... నాక్లాస్ టెస్టుందీరోజు..." అని లేచి నుంచున్న బృందని తోసుకుంటూ తబ్బూ బాత్రూంవేపు పరుగుతీసింది.

బృంద తన వ్యక్తిగతమైన పన్లు తన్జేసుకోగల్దు. అదోసౌలభ్యం నాకు. అయితే అన్నీ చాలాచాలా నెమ్మదిగా చేస్తుంది. టైంకి తెమలదు. అందుకని చేయించాలి. బృంద చిన్నగా ఆవలించి... నావేపు ఓ చిర్నవ్వులాంటిది విసిరేసి కిటికీ దగ్గరకెళ్ళి బైటికి చూస్తూ నించుంది... మళ్ళీ వెనక్కి తిరిగి, "మా వానొస్తుందీ," అంది.

నూర్ ఇల్లు కసాబిసా చిమ్మేస్తోంది. స్టౌ వెలిగించి పాలప్యాకెట్లు రెండు కత్తిరించి స్టౌ మీదుంచి కిచెన్ సింక్ దగ్గర బ్రష్ చేసుకుంటూ నన్ను నేను మసగ్గా ఉన్న (అయిపోయిన) సింక్ మీది అద్దంలో చూసుకున్నా...

ఒకట్రెండు తెల్ల వెంట్రుకలు... కళ్ళ కింద నల్లటి మరకలు... నుదుటిమీద స్టిక్కర్ అతికించీ అతికించీ ఏర్పడ్డ గుండ్రటి గుర్తు. నాకు ముప్ఫై అయిదేళ్ళ వయస్సు వచ్చేసింది అని ప్రత్యేకంగా చెప్పే గుర్తులేవీ లేవు... నా ఇద్దరు పిల్లలు తప్ప...

బ్రష్ చేసుకుంటూనే పొంగుతున్న పాలగిన్నె కింద బర్నర్ ఆఫ్ చేసి పాలమీద చిల్లుల మూత పారేసా...

బ్రష్ చేసుకుని నాకూ నూర్‌కీ టీ కలిపా. కిచెన్ కబార్డ్ కానుకుని కింద కూచుని పెద్దగా చప్పుడు చేస్తూ నూర్ టీ తాగుతోంది. నేనూ పెద్ద కప్పు నిండా టీ పోసుకుని దాదాపు పసుపురంగులోకి మారిన ఫ్రిడ్జ్ పక్కన స్టూల్మీద కూచున్నా.

"పైసలిత్తవా?" పెద్దగా అడిగింది నూర్.

"జీతమీరోజు తీసుకుంటా సాయంత్రం తీసుకో," అన్నా.

వంటగది మాసిపోయి మసిచూరిన బల్బు కాంతిలో మసగ్గా ఉంది. ఉల్లిపాయల బుట్టలో నాలుగే ఉల్లిపాయలున్నై... దానిపక్కగా వేల్లాడ్తోన్న మసిగుడ్డలు ఆ బల్బు కాంతిలో ముసుగేసుకున్న ముసలమ్మ ముఖంలాగా కనిపిస్తోన్నాయి.

ఫ్రిజ్ పెయింట్ పెచ్చులూడుతోంది... ఆ పెచ్చులూడిన జాడలూ... తబ్బూ బృందలతికించిన స్టిక్కర్లూ కకావికలంగా కలిసిపోయున్నాయి.

నూర్‌కు జీతమివ్వాలి... అందుకు ముందు నేను జీతం తీసుకోవాలి. శాలరీ కవరందిస్తూ ముసలి అకౌంటెంట్ వేళ్ళు తాకుతాడు. మానేజర్ పచ్చిగానే అడుగు

తాడు...'యూ లుక్ లవ్లీ టుడే... ఈ చీర సల్వార్ కమీజ్ కంటే చాలా బాగుంది...' అంటూ నడుం మీద చూపుతో నాకుతాడు.

ఒక్కసారి ఒళ్ళంతా జలదరించింది... నూర్ వేపు చూసా... మాసిపోయిన అందం నూర్‌బానో. క్యాలస్డ్ బ్యూటీ నూర్. కట్టుకున్న నైలెక్స్ పువ్వుల చీర మోకాళ్ళమీదికి జరిగుంది... పచ్చటి కాళ్ళు పిక్కలూ సన్నటి వెంట్రుకల్తో... నల్లగా పగిలిన చీలికల్తో పాదాలు... మట్టి పేరుకుపోయిన కాలిగోళ్ళు... రెండు బొటనవేళ్ళకీ పెచ్చులూడిన నెయిల్ పెయింట్.... మధ్య వేళ్ళకి మెట్టెలు.

నూర్... మాసిపోయిన అందం...

అప్రయత్నంగా మసిచూరిన బల్బ్‌కేసి చూసా... మళ్ళీ నూర్ కేసి... ఆ బల్బ్... నూర్ ఇద్దరూ పొగచూరి ఉన్నారనిపించేట్టు...

త్వరగా టిఫిన్ తయారుచేసి వంట వండేయాలి... ఈరోజు పిల్లల్తోపాటు స్కూల్కెళ్ళాలి... కరస్పాండెంట్ ఏం చెబుతుందో తెలుసు. బృందని స్కూల్నుంచి తీసుకెళ్ళమన్చెప్తుంది.

నాకు బృందని తీసుకెళ్ళి ఆ మెంటల్లీ రిటార్డెడ్ పిల్లల మధ్యన వేయడం సుతారామూ ఇష్టంలేదు. బృంద అన్నీ నేర్చుకుంటుందంతే... ఆ జబ్బే దానికి రాకుండా ఉండుంటే అదీపాటికి ఏ సెవెన్త్‌లోనో ఉండుండేది.

'ప్చ్' బృంద బావుంటే... ఫయ్యాం మాయమవకుండా ఉంటే... అన్నీ అన్నీ నేననుకున్నట్టుగానే ఉంటే ఈ నా ప్రపంచమిట్లా ఎందుకుంటుందీ... నిర్వేదంతో కూడుకున్న ఓ చిర్నవ్వు...

ఖాళీ టీ కప్ నూర్ కందించి బాత్రూం వేపు కదిలా... ఇద్దరూ ఏం చేస్తున్నారోనని... తబ్బూ బృందతో బ్రష్ మీద పేస్ట్ వేయిస్తోంది... "ఇట్టా... ఇట్టా... నెమ్మదిగా నొక్కు... అంతా బైటికొచ్చేస్తుంది... కరెక్ట్‌గా బ్రష్ మీదికి పెట్టు మూతి... అట్లా పిసక్కూ... ఛీ, నీకసల్లేమీ రాదు ఫో. చూడు చూడు పేస్ట్ బ్రష్మీదంతా పూసుకుంది... హాఁ..."

బృందని విసుక్కుని రెండు చేతులూ నడుం మీద పెట్టుకుని... తల వంచి ఓ పక్కకి కోపంగా చూట్టం మొదలు పెట్టింది... బృంద నోరంతా తెరిచి నవ్వింది.

నా అలికిడికి తబ్బూ బృందలిద్దరూ నావేపు చూసారు...

"నీదైందా?' అని తబ్బూనడిగి... "నువ్ కానీ వెళ్ళు నువ్ మొహం కడుక్కోవాలంటే ఓ యుగం," అని బృందని బాత్రూం వేపు చిన్నగా నెట్టా...

"చూడు మా! అది పేస్టంతా పిసికేస్తుందీ," అని కంప్లెయిన్ చేసింది తబ్బూ.

నవ్వి... "సరే సరే పద నీ ముఖం తుడుచుకో ముందు," అని మళ్ళీ కిచెన్‌వేపు తొంగి చూసా...

నూర్ వెనుకభాగం కనబడుతోంది... గిన్నెలు బరాబరా తోముతోన్న శబ్దం వినిపిస్తోంది...

పక్కింట్లోంచి సుప్రభాతం వినబడ్తోంది... ప్రపంచం చిన్నగా నిద్రలేస్తోంది అనుకున్నా...

★ ★ ★

మీ చిన్నమ్మాయి చాలా బ్రిలియంటండీ... కానీ బృందే... ఎలా చెప్పండి... ఏ క్లాసులోనూ ఉంచలేము... అందునా విపరీతంగా అల్లరి చేస్తుంది... అలాంటి పిల్లల కోసం ఆ వికాస్ రిహాబిలిటేషనో ఏదో ఉందిగా అందులో చేర్చండి..."

"కాదు మేడం... నేనొక్కదాన్ని... ఇంకెవ్వరూ లేరు... ఇక్కడైతే పిల్లలిద్దరూ కలిసి వస్తారు, వెళ్తారు... మధ్యాహ్నం కూడా బృందకు తబస్సుమే అన్నమదీ పెడుతుంది. నా ప్లయిట్ అర్థం చేసుకోండి ప్లీజ్!" దీనంగా అడిగా... నిజానికి లోపల అసహనంగా ఉంది... నా అసహాయతకి నా మీద నాకే కోపమొస్తోంది. బృందని బైట కూచోబెట్టి వచ్చా లోపలికి.

"మీరూ నా పరిస్థితి అర్థం చేసుకోవాలి... ఇది మామూలు స్కూల్ అలాంటి రిటార్టెడ్ పిల్లల్ని ఎకామడేట్ చేసుకోవడం చాలా కష్టం... అక్కడికీ ప్రయత్నించా మీకు తెలుసు... సారీ యూ కెన్ టేక్ బృందా... ఎన్..." ఇంకా ఏదో చెప్పబోతోందావిడ...

బైటినించి గట్టిగా బృంద ఏడుపు... నేనూ కరస్పాండెంట్ ఇద్దం కలిసి బైటికొచ్చాం...

అక్కడ వరండాలో క్రోటన్ పువ్వులు రేకులు రేకులుగా తెంపబడి వెదజల్లబడి ఉన్నాయి... ఓ టీచరు చీరకంటిన బురదని కడుక్కుంటోంది.

స్తంభానికానుకుని కూచుని బృంద ఏడుస్తోంది. ఆ టీచరు మా ముందు నుంచి రుసరుసలాడుతూ వెళ్తూ... "మొరాన్ మొరాన్ పిచ్చిముండ పిచ్చిముండ," అనుకుంటూ వెళ్ళిపోయింది.

అర్థమైందా? అన్నట్టు కరస్పాండెంట్ నావేపు చూస్తూ బృందవేపు చేతులు చూపింది.

తెలిసిపోతోంది... బృంద ఆ పువ్వుల్ని తెంపేసింది... ఆ టీచర్ దాన్ని చావగొట్టింది...

నన్ను కొట్టినా బావుణ్ణు అనిపించింది... అసహాయంగా బృంద దగ్గరికొచ్చి చెయ్యిపట్టి ఈడుస్తూ, "లే," అనరిచా.

ఓవేపు ఆఫీసుకు టైం అవుతోంది... ఇంకోవేపు భలే కూతుర్ని కన్నావ్ అన్నట్టు

కరస్పాండెంట్ చూపులు... పేడే ఈ రోజు... వెళ్ళి జీతం తీసుకోవాలి. ఏం చేస్తున్నానో జ్ఞానం కోల్పోయా... బృందని వంగదీసి దబదబా వీపు మీద చరిచి....

"లే యూస్‌లెస్ గాల్ లే," అనరిచా...

ఒక్కసారిగా బృంద కళ్ళల్లోకి భయం ప్రవేశించింది. యావత్తు ప్రపంచం కసిరినా విసుక్కున్నా... అది భరిస్తుందేమోగానీ... ఆఖరికి నేను... అమ్మ... కూడా...

విస్మయం నిండిన కళ్ళను విశాలం చేసి నా వేపు చూసింది... ఓ విధమైన అపనమ్మకం... అనుమానం... భీతి కలగలిసి రాని ఏడుపును ఆపేసాయి....

నే చేసిన తప్పు నాకు తెలిసిపోతోంది... ఏం చేశాను నేను?!

"నువ్వు కూడానా అమ్మా?" అన్నట్టు బేలగా జాలిగా నీళ్ళు నిండిన కళ్ళతో బృంద చూసే ఆ చూపును తట్టుకోలేకపోతున్నా...

'ఓ,'అని ఎలుగెత్తి అరవాలనిపించింది... అయినా దాన్నలాగే లాక్కుంటూ స్కూలు బైటికొచ్చేసా... స్కూలు గేటు బైట ఏంచేయాలా అనాలోచిస్తూ నుంచున్నా...

"మా! మా! నేనేం చెయ్లామా... పూలు సుజాత్తెపిందీ... మిస్ నన్ను తిట్టిందీ... నేను కాదంటే కూడా కొట్టొచీ పైపు తగిలి కింద పడిందీ... నిజం మా ... నేను కాదు మా,"

నా చెయ్యిని నిండుగా రెండు చేతుల్తో చుట్టి అంది బృంద... నాకళ్ళు మసకబారాయి...

ఎవరో చేసిందానికి బృందకి శిక్ష శారీరకంగా, మానసికంగా... 'మొరాన్ పిచ్చిముండ' టీచర్ ముఖంలో అసహ్యం...

అప్రయత్నంగా బృంద చుట్టూ చెయ్యేసి దగ్గరికి లాక్కున్నా... ఎందుకీ ప్రపంచంలో ఇంత దుర్మార్గం? కొద్దిగానైనా ప్రేమా దయా ఆర్ధ్రత బృందలాంటివాళ్ళ పట్ల చూపదేం ఈ ప్రపంచం.

ఈ ప్రపంచాన్నెందుకనాలి? నేను చేసిందేమిటి? వెనకా ముందూ చూడకుండా... బృంద శరీరమ్మీదా మనసుమీదా దెబ్బలేశానే... తెలుసు... బృందలో విధ్వంసక మనస్తత్వం లేదు... లేదని తెలిసీ... ఆపువ్వులు బృందే తెంపి ఉంటుందనీ ఎలా అనుకున్నాను? కాదు కాదు. నా లోపలి నిస్సహాయత నా చేతలా చేయించిది... ఏదేమైనా ఆఖరికి బలైంది అయాయకపు పిచుకపిల్లే కదా! ఛీ నా మీద నాకు అసహ్యం కలిగింది... అప్రయత్నంగా బృంద చుట్టూ ఉన్న చేయి ఇంకాస్త బిగుసుకుంది.

బృంద నావేపు నోరంతా తెరిచి నవ్వుతూ చూసింది... నాలోపలి ఖేదానికొ్కంచెం ఊరట...

పబ్లికబూత్‌నించి ఆఫీసుకి ఫోన్చేసి రజనితో మాట్లాడా.... ఈరోజుకి సెలవేసని

ఇంకాస్సేపాగి వచ్చి జీతం తీసుకుని సెలవు చిట్టీ ఇస్తానని చెప్పి ఆటో పిలిచి ఇంటికొచ్చేసా...

ఇంటివరకూ ఆటో వెళ్ళడానికి లేకుండా కంకరా ఇసుకా ఇటుకలూ రాళ్ళూ గుట్టలుగా వేసున్నాయి. ఉదయం ఇంట్లోంచి వచ్చేటప్పుడు లేవవి. ఇంటెదురుగా ఉన్న పాతిల్లు ఎవరో కొన్నారని విన్నాను పక్కింటి వాళ్ళ ద్వారా. ఆ పాతిల్లు బాగు చేస్తున్నట్టున్నారు కొన్నవాళ్ళు... వీధి చివ్వరే ఆటో ఆపేసి నేనూ బృందా నడిచొచ్చాం.

గుట్టగా పడున్న ఇసుకన్జూసి బృంద ముఖం విచ్చుకొంది.

'ఆయ్,' అంటూ నా చేయి విదిలించుకొని పరుగెత్తి ఆ గుట్టమీదికి గెంతింది. ఓనిముషం పాటు కేరింతలు కొడుతో గెంతుతూనే ఉంది... ఆ ఇసుక చెల్లాతెదురౌ తోంది... గట్టిగా కేకేశా... వచ్చేయ్యమని.

రాత్రి కురిసిన వానకి ఇంటి ముందు నీళ్ళు మడుగులు కట్టున్నాయి... కరిగిన ఎర్రమట్టి నీళ్ళు... ఇసుక గట్టు మీద గెంతుతున్న బృంద నాఅరుపుకి ఇటు గెంతి ఆ ఎర్రనీళ్ళ మీదకు దూకింది...

ఓ క్షణకాలం ఓ పెద్ద ఎర్రటి నీటిపూవు పుట్టి... వికసించి... అంతమైంది... మళ్ళీ పైకెగిరి ఆ నీట్లో మారోమారు గెంతింది బృంద. నీటి అడుగున మట్టి మెత్తటి బురదగా తయారైందేమో జారి దబ్బు ఆ నీట్లో వెల్లకిలా పడిపోయింది బృంద ఈమాటు.

నెమ్మదిగా లేచింది... బెరుగ్గా నావేపు చూసింది... అరుస్తానేమోనని... తెల్లచొక్కా తెల్లగౌను తెల్లటి బృంద ఆ ఎర్రటి బురదనీళ్ళలో తడిసి ఓ వింత మెరుపు...

నెమ్మదిగా నీళ్ళలోంచి బైటికొచ్చి తడిసిపోయిన తెల్లగౌను మడతను చూపుడువేలూ, బొటనవేలుతో సాపు చేస్తూ కింది పెదవిని నోట్లోకి లాక్కుని కళ్ళు మిటకరిస్తూ నించుంది... భయంగా... బిడియంగా...

ఓ నిముషం పాటు సీరియస్‌గా చూసి ఒక్కసారి ఫక్కుమని నవ్వేసా... చిన్నచిన్నగా నవ్వుతూ తను కూడా పెద్దగా నవ్వింది బృంద.

ఠప్పుమని ఓ పెద్ద చినుకు... ఇద్దరం నేనూ బృందా తలెత్తిచూశాం... మరో చినుకు... మరో చినుకు... టపటపా... జడి...

వర్షం... హర్షం... అంతవరకున్న ఖేదాన్ని కడిగేస్తూ హర్షవర్షం.

★ ★ ★

బృందని మానసిక వికలాంగుల కోసం పెట్టిన స్కూల్లో చేర్చబుద్ధి కాలేదు... ఇంట్లో నేనే పాఠాలు చెప్పదల్చుకున్నాను. ఆఫీసుకెళ్ళి వచ్చేవరకు మాత్రం బృందని ఒంటరిగా ఇంట్లోనే వదలాలి. ఇల్లెవరో దోచుకెళ్తారన్న భయం లేదు. బృంద గురించే బాధ... భయమూనూ...

ఓ రెండ్రోజులు ప్రయత్నించి చూడక తప్పదు... ఇది ఓ రోజుతో తీరిపోయే సమస్య కాదు. తాతయ్య నాకీ మూడు గదులున్న ఎనిమిదిసెంట్ల నేల మిగిల్చకపోయుండి ఉంటే... తల్చుకుంటే భయమేస్తుంది...

ఫయ్యూం నేనూ మనసుపడి పెళ్ళి చేసుకున్న తర్వాత రెణ్ణెల్లకే తాతయ్య కన్నుమూశాడు. ఫయ్యూం కుటుంబం మమ్మల్ని వెలేసింది. ఇప్పటిక్కూడా వాళ్ళ వాళ్ళెవ్వరూ ఇటు వేపు కన్నెత్తి చూడరు... ఫయ్యూం మరణించినప్పుడు కూడా రాలేదు...

ఫయ్యూం మరణం నాకిప్పటికీ జీర్ణం కాని కఠోర వాస్తవం... ఫయ్యూం తాగేవాడు. కానీ వారంలో శనివారం మాత్రమే... ఇంట్లో నాతో మాట్లాడుతూ పిల్లలిద్దర్నీ ఆడిస్తూ... తను పాడుతూ లేదూ... వేణువు వూదుతూ... ఎప్పుడూ వాయించి వినిపించేవాడు కళావతి... అదొక్కరాగం నాకు బాగా గుర్తుంది... ఆ రాగంలోనే ఫయ్యూం జీర్ణమైపోయాడు కాబట్టి...

ఆ రోజు ఎప్పటిలాగే శనివారం... పెరట్లో కూచున్నాం. పిల్లలిద్దరూ నాకూ రెండువేపులా కూచున్నారు... నా ముందున్న చిన్న వెదురు బుట్ట నిండుగా మల్లెలు... మాలకడుతున్నా... చాప పరుచుకుని నేనూ పిల్లలూ... మా ఎదురుగా కుర్చీలో ఫయ్యూం వేణువు వాయిస్తూ... పక్కన గ్లాసులో విస్కీ...

"చూడు విను ఇది కళావవతి... రతి సుఖసారే ఈ రాగంలో ఎంత బావుంటుందో తెలుసా..." అంటూ, అటు వేణువుతో కాసేపు పలికించి... మళ్ళీ అదే తనుపాడుతూ...

రెండవ చరణం ముఖర మదీరం త్యజమంజీరం పాడుతున్నాడు. కుర్చీ వెనక కాళ్ళు కింద మట్టిలో కూరుకుపోయాయి. అలా అలా చిన్నచిన్నగా వెనక్కి వాలుతూ దబ్బున కుర్చీతో సహా వెనక్కి పడ్డాడు. పిల్లలిద్దరూ గలగలా నవ్వుతూ తన దగ్గరకెళ్ళి గేలి చేయసాగారు. నేను కూడా...

"ఇక ఆట చాలు స్వామీ లే... మట్టిలో చిన్నపిల్లాళ్ళా..." అని మల్లెలు మాల కడుతూ ఉన్నాను.

ఎంతకీ లేవడు... పిల్లల కేరింతలాగాయి. వెళ్ళి దగ్గరగా కూచుని,

"ఫయ్యూ... లే... చాలన్నానా? లే?" అంటూ కదిలించా...

కదలిక లేదు... తెరచిన కళ్ళు ఆకాశాన్ని చూస్తున్నాయి...

వేణువు చితికిపోయింది... ఫయ్యూం తల పాదుకు పెట్టిన రాతికి కొట్టుకుని, నాముందే... నాకళ్ళ ముందే... ఫయ్యూం... మాయమైపోయాడు. నాలుగేళ్ళయినా ఆ కఠోర సత్యం నాకవగతం కాలేదు... నేనసలు జీవితంలో జీర్ణించుకోగలనన్న నమ్మకం కూడా నాకు లేదు.

★ ★ ★

ఆ తర్వాత సంఘటనలు నాప్రమేయం లేకుండానే జరిగిపోయాయి... ఫయ్యూం ఫ్యాక్టరీ వాళ్ళు రావడం... ఫయ్యూం అంత్యక్రియలు... డిగ్రీ చదివిన్నాకు కాంపన్సేటరీ గ్రౌండ్స్ కింద వాళ్ళ ఫ్యాక్టరీలోనే చిన్నపాటి ఉద్యోగం...

ఫయ్యూం రాహిత్యాన్ని పిల్లలు భర్తీచేయకపోయినా... నేను కొనసాగడానికి కారణమయ్యారు... ఆరోజున ఫయ్యూం సగం తాగ్గా మిగిలిన విస్కీ అలాగే భద్రంగా ఉంది... తను వాయించే వేణువుల సంచీ... తన పాటల డయిరీ... తను అమితంగా ఇష్టపడే తెల్లలాల్చీ పైజమాలు... తనువాడే షేవింగ్ సెట్టూ... తన చెప్పులూ అన్నీ... అన్నీ ఎక్కడివక్కడే ఉంచానీ ఇంట్లో...

దాదాపు ప్రతీరోజు వీటిల్లో ఏదో ఒక వస్తువుని తాక్కుండా ఉండను...

ఫయ్యూంని పూర్తిగా గుర్తు చేసేది బృందే... ఫయ్యూం నోట్లోంచి ఊడిపడ్డట్టుంటుందది... అదీకాక ఫయ్యూం ప్రాణం బృంద... ఎన్‌సెఫలైటిస్ సోకి ఇక చనిపోతుందన్నప్పుడు ఆహర్నిశలూ బృందను కంటికి రెప్పలా కాచాడు... మూడో ఏట ఆ భయంకరమైన జబ్బు తర్వాత బృంద రెండోసారి జన్మించింది... వచ్చిన నడకపోయి... మళ్ళీ నడవడానికి దాదాపు పద్దెనిమిది నెలలు పట్టింది.

వచ్చిన మాట పోయి మళ్ళీ చిన్నచిన్న శబ్దాలుగా భాష రావడానికి బృంద పడ్డ యాతన... ఫయ్యూం చేసిన లింగ్విస్టిక్ ప్రయోగాలూ... అన్నీ... ప్చ్... ఇప్పుడు నా జీవితానికి అర్థం పరమార్థం... బృందా తబుస్సుంలే...వీళ్ళే లేకపోతే...

★ ★ ★

ఎదురుగా ఉన్న పాతింటిని ఎవరో రచయిత కొన్నాట్ట.

నేను పుస్తకాలు చదవను. అతనువరో తెలీదు. నలభై అయిదేళ్ళుంటాయి. లాల్చీ పైజామాల్లో గడ్డంతో ఎప్పుడు సీరియస్గా ఉంటాడు. పాత ఇంటి రూపురేఖలు త్వరత్వరగా మారిపోతున్నాయి. ఆ ఇంటి పెరడు ఖాళీస్థలమంతా గడ్డిపెళ్ళలు తెచ్చి పేర్చి లాన్ తయారు చేసేశారు. రకరకాల మొక్కల కుంపట్లు ఓ లారీతో వచ్చాయి.

ఆ ఇంటి మార్పిడి పనులు బృందలో చాలా ఉత్సాహాన్ని తెచ్చాయి. తబ్బూ ఒక్కతే స్కూలు కెళ్ళొస్తోంది. బృందకు ఇంట్లోనే పాఠాలు చెబుతున్నాను.

కానీ ఉదయం ఆఫీసుకెళ్ళినప్పట్నుంచీ బృంద ధ్యాసే... పక్కింటి రిటైర్డ్ హెడ్‌మాస్టర్ – 'మేముంటాం కదమ్మా నువ్వెళ్ళు తనకు తాను అన్నం తినగలదు... బాత్రూం వెళ్ళగలదు. ఇరుగుపొరుగన్న తర్వాత ఆ మాత్రం చూసుకోలేకపోతే ఎలా,'అని చెప్పిన మాట ధైర్యంతో వెళ్ళొస్తున్నా ఆఫీసుకి.

ఆ హెడ్మాస్టర్ అతని కూతురూ, అల్లుడూ ఉంటారు పక్కన. కూతురూ, అల్లుడూ ఇద్దరూ ఆర్టీసీలో పన్జేస్తారు. వాళ్ళకి పిల్లల్లేరు...

సరే ఎలాగూ ఎదురుగా రీమాడల్ చేయబడ్తోన్న పాతిల్లు బృందని ఎంగేజ్ చేస్తోంది. మధ్యమధ్యన ఈ ధైర్యం చెప్పిన పెద్దాయన ఉండనే ఉన్నాడు అన్న భరోసాతో ఓ పదిరోజులు గడిచాయి.

ఆ రోజు రజని తన కొడుకు బర్త్‌డే... సాయంకాలం చిన్న సెలబ్రేషన్. పిల్లల్ని తీసుకునింటికి రమ్మంది. రజనీ నేనూ ఇద్దరం మధ్యాహ్నం లంచ్ తర్వాత పర్మిషన్ తీసుకుని ఆఫీసు వదిలాం. రజని అటు ఇంటికెళ్ళిపోయింది. టీ పార్టీ ఆరేంజ్ చేసుకుందుకు. నేనిటు స్కూల్కెళ్ళి, తబ్బూని పర్మిషన్తీసుకుని పిల్చుకునింటికి మూడింటికొచ్చేశా. తలుపు బైటనించి గొళ్ళెం పెట్టుంది. బృంద ఎదురింట్లోనో, పక్కింట్లోనో ఉంటుంది వెళ్ళి పిల్చుకురమ్మని తబ్బూని పంపించా.

అది వెళ్ళి ఎదురుగా తయారౌతున్న ఇంటి ముందున్న ఇసుక కుప్పల మీద వాచ్‌మన్ పిల్లల్తో ఎగుర్తో అడుతోంది. కాంపౌండ్ అని పిలుచుకునే వెదురు తడక దగ్గరకెళ్ళి గట్టిగా కేకేశా. 'బృందా... బృందా...!' అని... నా అరుపు విని గెంతుతోన్న తబ్బూ నావేపు తిరిగి చేతులు వెనక్కి తిప్పుతూ, "అదిక్కళ్ళేదూ..." అని అది కూడా గట్టిగా 'బృందా,' అని కేకేసింది.

ఊహూఁ... అన్నట్టు తలూపి మళ్ళీ తనాటలో మునిగి పోయింది. ఎక్కడ ఏం కొంపలు ముంచుతుందో అన్న భయం...

పక్కింటికెళ్ళా. అలికిడి వినిపించలే... హెడ్మాస్టరు కూతురు, అల్లుడూ ఇంకా ఆఫీసునుంచి వచ్చినట్టు లేదు. ఆ ఇంటి పక్కగా ఉన్న సందులోంచి ఇంటి వెనక్కి దారుంది. చిన్నగా ఆ సందులోంచి వాళ్ళింటి వెనక్కి... వాళ్ళ వెనక వరండా చేరుకున్నా. అక్కడా ఎవ్వరూ లేరు... వెనక్కి తిరుగుతోండగా...

"హి హి హి," అని బృంద నవ్వు వినిపించింది. వరండా కుడివేపు ఉన్న కిటికీ వారగా తెరిచుంది.

సభ్యత కాదన్తెల్సినా ఆ కిటికి పక్కన్నిలబడి సందులోంచి చూసా... ఒక్కసారి వంట్లో నెత్తురంతా నా ముఖంలోకి ప్రవహించింది... చెవులు ఓ విధమైన హోరుతో మూసుకున్నట్ట నిపించింది... ముక్కుపుటాలు పెద్దవయ్యాయి...

హెడ్మాస్టరు ఒళ్ళో బృంద... హెడ్మాస్టరు చేతులు దాని వంటిని పాముతున్నాయి. వాడి ముఖంలో కాముక వికృతత్వం ప్రస్ఫుటంగా...

"హి... హి... హ్హీ..., గిలిగిలీ తాతయ్యా", అమాయకపు బృంద...

పాముల్లా వాడి చేతులు బృంద వంటిమీద పాకుతున్నాయి... బృంద లంగా తొడల మీదకు జరిగి ఉంది... మృదువైన దాని పాలచెక్కిళ్ళ మీద... ముడుతలు పడి కాముకతతో బిరుసెక్కిన ముసలి పెదవులు..

"బృందా!"

కోపంతో... భయంతో... అసహ్యంతో... ఏమీచేయలేని అసహాయతతో... కసితో... దుఃఖంతో...

వాడు తలెత్తి చూశాడు... ఏమాత్రం జంకూ, భీతి లేకుండా అపరాధభావనా లేకుండా నన్ను చూశాడు.

బైటికొచ్చి... "హిహ్హీ పాపనాడిస్తున్నా," అని గిరుక్కున వెనక్కి తిరిగెళ్ళిపోయాడు...

బృంద, "మా... దా పోదాం," అని చేయి పట్టుకుంది అమాయకంగా...

నాకింద నున్న భూమి తన యావద్గురుత్వాకర్షణశక్తినీ కేంద్రీకరించి నన్ను తనలోకి పీల్చుకొంటున్న భావన...... ఇప్పుడు నా బరువు ఇంకో భూమంత..... అడుగు తీసి అడుగెయ్యలేకపోయా...

బృంద నా కళ్ళకు అచ్చయిన ఏదో మహాకావ్యంలా అనిపించింది. ఆ కావ్యపు కాగితాల్ని చించి ఆ భ్రష్టుడు తన శౌచక్రియకు వాడుకుంటున్నాడు.

లంజకొడుకు... అని గట్టిగా అరిచేసా...

"లంజా... కొ...డ...కా...! ఆ" అని. నా కళ్ళ వెంబడి నీళ్ళు ధారగా...

బృందని కావలించుకుని వళ్ళంతా దులిపా... 'బృందా... బృందా,' అని గొణుగుతూ... దాన్నింటికి లాక్కొచ్చి... బాత్రూంలోకి తోసి ట్యాప్కింద కూలదోసి ట్యాప్ ఆన్చేసా...

భీతిల్లి... విహ్వలంగా చూస్తూ బృంద...

బాత్రూం గోడకానుకుని కూలబడి రోదిస్తూ...నేను...

ఈ జుగుప్సాకరమైన విషయాన్ని ఎవర్తో మొరపెట్టుకోవాలి? ఎవరికి చెప్పినా నమ్మరే!

మొగుడు పోయిన ముండకన్నీ అలాంటాలోచన్లే... లేకపోతే పాపం ముసిలాయన పిల్లదాన్నాడిస్తుంటే... అసహ్యకరమైన మాటలు మాటాడ్తోంది... అన్న ఎదురుదాడి తప్ప ఇంకేముంటుందీ...? ఎలా దీన్ని నేనెదుర్కోవాలి? ఒక్కరోజు రెండ్రోజులా...! బృంద తనన్తాను ఎప్పుడికి కాపాడుకోగల్గుతుంది...!

రజని ఇంటికి దాని కొడుకు బర్త్డే పార్టీకి వెళ్ళాననేగానీ... ఆ ముసలి మృగం నన్ను వెంటాడ్తోనే ఉంది...

నాక్కనిపించీ రోజుకు వీడొక్కడే... రోజూ బృంద ఒక్కతే ఉన్నప్పుడు... ఎందరో! ఎన్ని మానవ మృగాలో? రాత్రి బృందని ఇంకా గట్టిగా కావలించుకు పడుకున్నా!

★ ★ ★

ఏదో ఇరుకు గది... చాలా పాతది... పురాతన మైనది... చీకటి... చీకట్ని పారద్రోలడానికి... పెద్ద కొవ్వొత్తి... చాలా పెద్ద కొవ్వొత్తి.

పాత కొయ్యబల్ల మీద ఆ పెద్ద కొవ్వొత్తి వెలుగులో ఏదో అతి పురాతనమైన అతి పెద్ద పుస్తకాన్ని తెరుస్తూ నేను... పుస్తకం అట్ట బంగారు రంగు డిజైన్లో మెరుస్తోంది. ఆ పుస్తకంలో దేనికోసమో ఆతురతతో వెదుకుతున్నా... ఏమిటో తెలియదు.

గబగబా రెండు మూడు పేజీలు తిప్పా... మళ్ళీ వెనక్కి... మళ్ళీ ఓ నాలుగైదు పేజీలు ముందుకు... ఏం వెదుకుతున్నానో... నాకాపుస్తకంలో ఏం కావాలో ఎంతాలోచించినా తోచడంలేదు... కానీ వెదికితే దొరుకుతుంది... అనిపిస్తోంది... కాని అదేమిటో తెలియదు.

మళ్ళీ గబగబా పేజీలు తిప్పసాగాను... రెండు మూడు... నాలుగైదు... వేగం పెరుగుతోంది... పుస్తకం అటూ ఇటూ... ముందుకూ వెనక్కూ పేజీలు తిప్పుతూనే ఉన్నా.

ఉన్నట్టుండి ఉధృతంగా గాలి... పెద్ద కొవ్వొత్తి ఆరిపోయింది. క్రీచీకట్లో గాలికి రెపరెపలాడ్తోన్న ఆ పేజీలను ఆపి ఆ పుస్తకాన్ని మూయాలని ప్రయత్నిస్తున్నా...ఉహూఁ ... ఆ పుస్తకం పేజీలు తీవ్రంగా రెపరెపలాడ్తోన్నాయి.

ఒక్కసారిగా ఆ పుస్తకం పేజీలు అన్నీ విడిపోయాయి... కిటికీ తెరుచుకుంది... తెరుచుకున్న కిటికీలోంచి ఆ పుస్తకం పేజీలు బైటికి కొట్టుకుపోసాగాయి...

ఎలా వచ్చానో! ఎలా ఉన్నానో బజార్లో బాగా రద్దీలో ఉన్నాను... పట్టపగలు... గాల్లో ఎగిరొచ్చిన పేజీలు... బైటి జనాల చేతుల్లో... ఒక్కోరి చేతిలో ఓ పేజీ... అందర్నీ అడుగుతున్నాను.... 'ఇవ్వండి ప్లీజ్... అది నాది... నాది... ఇచ్చేయండి,' అని.

ఎవ్వరూ నన్ను గమనించడంలేదు. వాళ్ళకసలు నా గ్రహింపు లేదు. వెళ్తున్న అందరూ ఒక్కొక్కరుగా వాళ్ళ చేతుల్లోని ఆ పుస్తకం కాగితాన్ని ఓ చెత్తకుండీలో వేసి వెళ్ళిపోతున్నారు... నేను వారిస్తున్నా... ఎవ్వరూ నన్ను పట్టించుకోడంలేదు. నేను వాళ్ళనెవ్వర్నీ ఆపలేకపోతున్నా... ఉన్నట్టుండి వీధి వీధి ఖాళీ అయిపోయింది. నిశ్శబ్దం... నిర్మానుష్యం...

నే వెళ్ళి చెత్తకుండీలోకి తొంగిచూశా... అందులోకి మెట్లున్నాయ్... చీర ఎగదోపుకుని ఆ కుండీలోకి దిగా... మెట్ల వెంబడి చీకట్లోకి దిగసాగా. ఒకటి... రెండు.... ఆరు... తొమ్మిది...

వేగం పెంచి రెండు మూడు మెట్ల కిందికి గెంతుతూ దిగసాగా... ఉన్నట్టుండి కాళ్ళకి మెట్టు తగల్లే... జారా... పడిపోతున్నా... లో... లోతుల్లోకి... చీకటి లోతుల్లోకి

జారి పడిపోతున్నా... అడుగు తగలడంలేదు... పడిపోతున్నా... పడుతూనే ఉన్నా... కిందికి చీకటి అగాధంలోకి... దబ్...

మెలకువ...

ఒళ్ళంతా చెమటలు పట్టున్నాయి. తల విదుల్చుకుని మీదనున్న బృంద కాలు పక్కకు తొలగించి మంచం దిగి ఓ రెండు గ్లాసుల నీళ్ళు తాగి... అప్రయత్నంగా ఫయ్యూం ఫోటో వంక చూసి మళ్ళీ వచ్చి పడుకున్నా.

★ ★ ★

నాకు ఊరట కలిగిస్తున్నట్టు పక్కింటి హెడ్మాస్టరు... రెండో కూతురు దగ్గరకని వెళ్ళిపోయాడు మర్నాట్రోజే... నేనరిచిన అరుపులో నేను వాణ్ణి చంపేయగల్నన్న తెగువ చూసుంటాడు. పారిపోయాడు.... వాడికి తెల్సు వాడేం చేశాడో... నన్ను ఫేస్ చేయలేదు వెధవ... అదొక రిలీఫ్. కానీ వాడొకడే కాదే... ఈ పిచ్చి పిచుకపిల్లనెలా కాపాడాలి?

విధిలేని పరిస్థితిలో దాన్ని నా వెంట ఆఫీసుకు తీసుకెళ్ళసాగాను... పై అఫీషియల్స్‌కి సంజాయిషీ ఇచ్చా...

బృందనో పదిరోజుల్తర్వాత 'వికాస్'లో చేర్చుకుంటామన్నారు, అంతవరకూ పాపనాఫీసుకు తీసుకురాక తప్పదని... దయచేసి భరించమని. నాకు తెలుసు నేనబద్ధమాడుతున్నా... బృందని ఆ స్కూల్లో ఖచ్చితంగా చేర్చను... కానీ ఏదో ప్రత్యామ్నాయం దొరికేవరకూ... నాకో ఆలోచన తట్టేవరకూ.... నాకు ఓ పదిరోజులు గడువు దొరుకుతుంది.

ఈ జీవితంలో ఇంకెన్ని వేషాలు వేయాలో!

కానీ ఎక్కువ రోజులు అబద్ధాలతో లాక్కురావడం సాధ్యపడదని తెలుసు!

ఆఫీసుకి బృందన్తీసుకెళ్ళడం నాకేమీ ఇబ్బందిగా లేదు. ఆఫీసులో కూడా ఎవ్వరూ అబ్జెక్ట్ చెయ్యలేదు... కానీ ఇబ్బందల్లా బృందదే. నాతో ఉదయాన్నే ఆఫీసుకు రావడం నే పన్లో పడిపోగానే ఆఫీసంతా చిన్న చిన్నగా కలయతిరగడం... నే తీసుకొచ్చిన కామిక్స్... బొమ్మల పుస్తకాలు చూస్తూ భోజనాలు చేసే గదిలో గడపడం... నిద్రొస్తే అక్కడే చిన్న బెంచీ మీద నిద్రపోవడం చేస్తోంది... ఎందుకింత శిక్ష ఈ పసిదానికి...

ఇది ఎవరు విధించిన శిక్ష? సమాజమా? ప్రకృతా?

అంతరాంతరాల్లోకి చూసుకుంటే... తరచి తరచి నన్ను నేను ప్రశ్నించుకుంటే అది బృందకి నేను విధించిన శిక్షే అని అవగతమవుతోంది.

బృందనా మెంటల్లీ రిటార్టెడ్ పిల్లల మధ్య వదల్లేను... కారణం, నా బిడ్డ మెంటల్లీ రిటార్టెడ్ కాదు... దానికి మెదడు సక్రమంగానే పన్జేస్తుంది... అది... అది పిచ్చిది

కాదూ అని సమాజానికి నేను నిశ్శబ్దంగా... సమాజం నన్నడగని ప్రశ్నకు నేనిచ్చిన సమాధానం... ఆ పిచ్చి సమాధానమే బృందకు శిక్షగా పరిణమించింది.

బృందకే కాదు. నా ఆ చర్య నాక్కూడా చిన్నపాటి శిక్షగానే తయారైంతి. మేనేజర్గాడు బృందని ఆఫీసుకు తీసుకు రానివ్వడంలో నాకేదో మెహర్బానీ చేసినట్టు ఊహించుకుని... నా దగ్గరింకా చనువు తీసుకోడానికి ప్రయత్నిస్తోన్నాడు... చికాగ్గా ఉంది. వాడి ముందు పళ్ళికిలిస్తూనే మాట్లాడాలి తప్పదు... నాకీ ఉద్యోగం అవసరం. ఓరోజు మధ్యాహ్నం లంచ్ అవర్లో రజని అడిగింది.

"ఎన్నాళ్ళిలా?"

తెలీదన్నట్టు కళ్ళెగరేసి తలపక్కకి తిప్పి నవ్వి బృందకి కంచంలో అన్నం పెట్టా.

"బృందా మళ్ళీ ఆ స్కూల్కే వెళ్తావేంటే," అని బృంద బుగ్గని సాగదీసి అడిగింది.

బృంద ఆశగా కళ్ళు పెద్దగా చేసి, "పోతా ఆంటీ... సుజీ, లతా, షబ్బీరుగాడూ నా ఫ్రెండ్స్... ఆ నల్లీ కూడా... మా పెద్ద మిస్ వద్దంది... అల్లరి కూడా చైనూ... మా... మా... స్కూలుకు పోతా మా ప్లీజ్ మా..." ఆగకుండా మాట్లాడింది బృంద. ఏమీ చేయలేని అశక్తతతో తలడ్డంగా ఊపుతూ అన్నం తినసాగా...

"ప్రభాకర్ చేయగలడా పని," ఆది మధ్యంతాలు లేకుండా అంది రజని.

తల తిప్పి రజనికేసి ప్రశ్నార్థకంగా అర్థం కానట్టు చూశా... "వాట్...?"

అవునన్నట్టు తలూపి మళ్ళీ అంది రజని.

"ఎస్ ప్రభాకర్ కెన్ హెల్ప్ యూ అవుట్."

"వా...డు?... యూ మీన్... ఏంటి మాట్లాడుతున్నావే నువ్వు?" అడిగా.

"చెప్తా చెప్తా... నువ్వు విసుక్కోనంటే చెప్తా... కోపగించుకోకూడదు కూడానూ. దీన్నిలా చూట్టం నాకస్సలు బాలేదు... అందుకనే ఆలోచించా. మనం కొన్ని పనులు మనకిష్టం లేకపోయినా మనకిష్టమయిన వాళ్ళకోసం చేసి తీరాలే. ముందు అన్నం తిను... ఒకటి మాత్రం నిజం... ఆ ప్రభాకర్ బృందని మళ్ళీ అదే స్కూల్లో జాయిన్చేయించగల్డు... ముందన్నం తిను చెప్తా," అంది రజని.

"నో అయ్ కాన్ట్ అప్రోచ్... దట్... నావల్ల కాదే... సరే ముందు విషయమేంటో చెప్పు," అన్నా.

"భోంచెయ్యి... దా బృందా ఈ పెరుగన్నం ముద్ద తీసుకో నాన్నా," అని చేత్తో నిండుగా కలిపిన పెరుగన్నం బృంద ప్లేట్లో వేసి క్యారియర్ సర్దుకుని చెయ్యి కడుక్కోడానికి లేచింది రజని.

చుట్టూ చూశా... మా టేబిల్కి దూరంగా మూలకున్న టేబిల్మీద జాన్సన్, వైకుంఠం, సుగంధరావు క్యారియర్లు విప్పుకుని కూచున్నారు... మిగిలినవాళ్ళు కొంతమంది

అయిపోయ్... ఇంకొందరు క్యాంటీన్కి... దగ్గరే ఉన్న ఇళ్ళకీ వెళ్ళారు... ప్రభాకర్ తన ఛాంబర్లోనే భోంచేస్తాడు. వాడికి క్యారియర్ ప్యూన్ వెళ్ళి తెస్తాడు.

బృందవేపు చూశా... అన్నం తినేసింది... రజని పెట్టిన పెరుగన్నమ్ముద్ద కూడా తినేసి వేళ్ళు చీకుతోంది. "చాల్లే... ఇక వేళ్ళు చీక్కలా... కడుక్కో" అని నేనూ లేచా.

బైట కారిడార్ మెట్లమీద కూచున్నాం నేనూ రజనీ బృంద కామిక్ బుక్ చదువుతూ మాక్కాస్త దూరంగా కూచుకుంది.

"ఈ మహానగరంలో చాలా స్కూళ్ళే ఉన్నాయి... నీకు అన్నివిధాలా ఆ స్కూలే కన్వీనియంట్. ఆ విషయం నాకు తెల్సు... మనం నిజాల్ని నిజాలుగానే తీసుకోవాలి... ఈ ప్రైవేట్ స్కూళ్ళలో వాళ్ళకి పిల్లల పెర్ఫార్మెన్స్ పెట్టుబడి. వాళ్ళ స్కూళ్ళలో అందరూ ఏవన్ స్టూడెంట్లే ఉండాలని వాళ్ళు కోరుకుంటారు. అక్కడికీ వాళ్ళు బృందని ఏడాదిన్నర పెట్టుకున్నారు. ఆ విషయం కూడా మనం గమనించాలి. అదీకాక..." ఇంకా చెప్పబోయిన రజనిని అడ్డుకున్నా విసుగ్గా.

"నాకీ విషయాలేవి తెలీవనుకోకు... నువ్వనుకోవన్న సంగతీ నాకు తెలుసు. కానీ అసలు విషయానికి రా," అసహనంగా అడిగా...

"ఈ ప్రభాకర్ పెళ్ళాంవేపు బంధువులదే ఆ స్కూల్. అక్కడ వీడి మాట నడుస్తుంది. వాడికీ తెలుసు... నువ్వడగడం కోసం కాచుక్కూచున్నాడు. నువ్వడగడమాలస్యం. రేపుదయాన బృంద మళ్ళీ అదే స్కూల్లో అదే క్లాసులో ఉంటుంది... అక్కడి టీచర్లు బృంద పట్ల కాస్త జాగర్తగా కూడా ఉంటారు," ఆగింది రజని.

"రజనీ..." బాధగా రజనివేపు చూశా...

"నాకు తెలుసు వాడు చేస్తున్న అడ్వాన్సెస్ అందరూ గమనిస్తూనే ఉన్నారు. నిన్నేమీ వెళ్ళి వాణ్ణి కావలించుకోమంటంలే... కాస్త పళ్ళికిలించి మాట్లాడు. నువ్వు తప్ప నాకీసాయం ఎవరు చేస్తారన్నట్టుగా జాలిగా అడుగు... అంతే... అదే నే చెబుతున్నది... బీ ప్రాక్టికల్... యూ కెనాల్వేస్ అవాయిడ్ దట్ మ్యాన్... నువ్వు కాదంటే నిన్ను రేప్జేసేంత, ధైర్యమూ, బలమూ రెండూ లేవ్వాడికి... ఇంకాస్త చొరవగా మాట్లాడ్తాడంతే... వాడొట్టి చొంగగాడే..." చిన్నపిల్లకు చెప్పినట్టు చెప్పింది రజని.

అర్థమైందన్నట్టు తలాడించా.

"నీకే కాదే. నాక్కూడా బృందని ఆ మెంటల్లీ రిటార్టెడ్ స్కూల్లో వేయడం ఇష్టంలేదు. మనం మన జీవితాల్లో చాలాచాలా పన్లు మనకిష్టం లేకపోయినా మనం ఇష్టపడే వాళ్ళ కోసం, మనం ప్రేమించేవాళ్ళ కోసం చేయక తప్పదు. పిచ్చీ ఇది నీజీవితమే," రజని ఆప్యాయతకి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

ప్రభాకర్నడిగా... అడగ్గానే ప్రభాకర్ ముఖం నిజంగా సూర్యుడిలా

వెలిగిపోయింది... "యూ జస్‌టెల్మీ... అసలు ముందే ఎందుకు చెప్పలేదూ... రేపట్నించీ పాప మళ్ళీ అదే స్కూల్‌కు వెళ్తుంది... యూ లుక్ గార్జస్ యిన్దిస్‌డ్రస్."

"ఓ థాంక్స్ అలాట్... ఎప్పుడూ... పాప?" అడిగా ఇకిలిస్తూ...

"ఇప్పుడే ఈవినింగ్ వాళ్ళింటికెళ్తా... యూ నో కమ్లా ఈజ్ కజినాఫ్ మై వైఫ్."

ఏమి కజినో ఏమో, కమ్లా అని ప్రభాకర్గాడు అన్నామె కమలాడోరతీ ఏభై ఏళ్ళావిడ... వాడికింకో ఇకిలింపు, ఇంకో థ్యాంక్సూ పారేసి వచ్చేశా... వస్తూ వస్తూ వాడు నా నడుం కింది భాగాన్ని కసిగా చూట్టం గ్రహించా...

ఆఖరికి జనం ఆడతనాన్ని యావత్తూ ఓ బెత్తెడు శరీర భాగానికి కుదించేసారు... 'ప్చ్' అనుకున్నా నిట్టూరుస్తూ...

ప్రభాకర్ నాకు సాయం చేయడానికి ఏ మాత్రమాలస్యం చేయడు... చేయలేదు కూడా... నేను తన ఛాంబర్లోంచి బైటికి రాగానే ఫోన్చేసి మాట్లాడినట్టున్నాడు. ఓ అరగంట తర్వాత నాకు పిలుపొచ్చింది వాడి దగ్గర్నుంచి. నడుం కనబడకుండా కొంగును చుట్టుకుని వెళ్ళా...

నన్ను చూడగానే అప్రయత్నంగా వాడి చూపులు నా నడుంకేసి మళ్ళాయి. ఆ కళ్ళలో నిరాశ కొట్టొచ్చినట్టు కనబడింది.

"మాట్లాడా కమ్లాతో ఈ రోజు ఈవెనింగ్ ఆఫీస్ నించి వెళ్ళేప్పుడు స్కూల్‌కి వెళ్ళు... కమ్లా... షీటూ వాన్ట్స్ టు టాక్టు యూ... యూ రీలీ లుక్ గార్జస్... నన్ను కూడా రమ్మన్నావా? అయ్ యామ్ యాబ్సలూట్లీ ఫ్రీ దిసీవినింగ్,"

"నో... నానానో థాంక్యూ... నే వెళ్తా... అయ్‌డోన్ట్ వాన్ట్ టు ట్రబుల్యూ... థాంక్సెలాట్," ఇక వాడికి మాట్లాడే అవకాశమివ్వకుండా వచ్చేశా వాడి క్యాబిన్‌లోంచి.

★ ★ ★

సాయంకాలం ఓ గంట ముందే ఆఫీస్ నుంచి బయటపడ్డా బృందతో. బయటికి రాగానే బృందతో చెప్పా... "మళ్ళీ నువ్వు మీ ఫ్రెండ్స్‌తోటే చదూకోవచ్చు నానా."

"మళ్ళీ మాస్కూలేనా మా...? రజనీ అంటీ చెప్పింది కదా మజ్జాన్నం... బాంది... బాంది..." దాదాపు కేరింతలు పెట్టినంత చేసింది...

కరస్పాండెంట్ గది ముందు ఓ పదిహేన్నిమిషాలు వెయిట్జేయాల్సి వచ్చింది. స్కూల్లో కదుగు పెట్టగానే... ఓ ఏడేనిమిదేళ్ళ కుర్రాడు ఎర్రగా ఉన్నాడు. దూరం నించీ మమ్మల్ని చూడగానే...

"హాయ్ హాయ్ దుమ్సు... దుమ్సు వచ్చేసిందీ... నల్లీ లతా దుమ్మొచ్చిందీ," అని గట్టిగా అరిచాడు... చాలామంది పిల్లలు రకరకాల ఆటలు ఆడుకుంటున్నారు.

బృంద వెంటనే నాచేయి విడిపించుకుని, "షబ్బా..." అంటూ వాడివేపు పరిగెత్తింది.

పరిగెడ్తున్న బృందని చూస్తే ఆనందం, ఖేదం వెంటవెంటనే తన్నుకొచ్చాయి. ఆనందం దాని ఆనందాన్ని చూసి... ఖేదం పరిగెడ్తూన్న బృంద శరీరాన్ని చూసి... రొమ్ములు కదుల్తున్నాయి... దాదాపు ఓ పదిహేనేళ్ళమ్మాయిలా ఉంది... దాని అండర్‌వేర్ గురించి జాగ్రత్త తీసుకోవాలని నిర్ణయించుకున్నా. కరస్పాండెంట్ కమలాడోరతి దగ్గర్నుంచి పిలుపొచ్చింది.

లోపలికడుగు పెట్టా... ఆమెతోపాటు ఇంకో నలభై అయిదేళ్ళ స్త్రీ ఉంది...

"రండి కూచోండి... దిసీస్ మిస్ షహనాజ్... నెక్ట్స్ వీకనించీ షీ విల్బీ హియర్ ఇన్ మై ప్లేస్... నేను స్టేట్స్‌కి వెళ్లిపోతున్నాను. మిస్ షహనాజ్ దిసీస్ద ఉమన్ అయ్ వాజ్ టాకింగ్టుయూ ఎబౌట్..."

రెండుచేతులూ జోడించా...

ఆమె టేబిల్ చుట్టూ తిరిగి వచ్చి రెండు చేతుల్తో నా రెండు చేతులూ పట్టుకుని, "వేరి నైస్ టు మీ ట్యూ... సిస్టర్ డోరతీ మీగురించీ, మీ పాప గురించీ పూర్తిగా చెప్పారు. నిజానికి నేను వెళ్ళాల్సింది... మీరు వస్తున్నారని తెలిసి మీ కోసమే ఆగా... పాపను తెచ్చారా..."

ప్రపంచంలో ఉన్న ఆప్యాయతా ఆత్మీయతా స్నేహం ప్రేమా స్త్రీత్వం అంతా కరిగిపోయి కలసిపోయి మళ్ళీ కరడుగట్టి ఘనీభవించి షహనాజ్ అన్న ఆమె రూపం తీసుకున్నాయా అనిపించింది... నాకు తెలీకుండానే నాకళ్ళు చెమ్మగిల్లాయి. తలూపుతూ ఆమె చేతుల వెచ్చదనాన్ని ఆస్వాదించా...

"మీరు మళ్ళీ రైట్ టైంలో నన్ను కలిశారు... మా అబ్బాయి చార్లోజుల్నుంచి నన్నక్కడికి వచ్చేయమని ఫోన్స్ చేస్తున్నాడు... మిస్ షహనాజ్ మాకు పరిచయం కావడం మాకు అదృష్టం. ఇట్స్ గాడ్స్ గ్రేస్... ఆల్దీజ్ ఛిల్రనార్ బ్లెస్డ్ బై దలార్డ్... మిస్ షహనాజ్ ఈజ్ ఎ ట్రైన్డ్ చైల్డ్ సైకాలజిస్ట్... డెన్మార్క్‌లో ఆరేళ్ళు చేశారు... గాడ్వాస్ సెంట్వైర్ ఫర్ద చిల్రన్,,, నేను చెప్పాను మిస్ షహనాజ్కి ఎవ్రీథింగ్ ఎబౌట్ బృందా అండ్ యూ."

"థాంక్యూ మామ్... ఎట్లా... థాంక్స్ థాంక్సెలాట్."

లోపల ప్రభాకర్కి నిజంగా థాంక్స్ చెప్పుకున్నా... రజనికింకా ఎక్కువ... నాచేతులు నెమ్మదిగా వదిలింది మిస్ షహనాజ్.

ఆమెవేపు నిశితంగా చూశా... నలభైకీ నలభై అయిదుకీ మధ్య వనస్సుంటుంది. చామనఛాయ... మొహం మీద పల్చగా స్ఫోటకపు మచ్చలు... రిమ్‌లెస్ అద్దాల్లోంచి

నల్లటి కనుపాపల్తో విశాలంగా ప్రేమపూరితంగా చూసున్న కళ్ళు... ఆమె ఒకే ఒక స్పర్శతో నాలోకి స్నేహాన్నీ ప్రేమనీ ప్రవహింపజేసింది... అమ్మతనం నా ఎదురుగా ఆవిష్కరించబడ్డట్టుంది... ఆమె చేతుల్లో బృంద నా దగ్గరకంటే పదిలంగా ఉంటుదన్న భావన అసంకల్పితంగా కలిగింది నాకు. ఈమె నా ఎదురుగా ఉన్న ఈమె... ఒక్క అయిదు నిముషాల క్రితం నాకు పరిచయం చేయబడ్డ ఈమె నాకు ఎన్నో ఏళ్ళుగా జన్మలుగా తెలుసన్న భావన...

కొందరంతే... వాళ్ళ చుట్టూ ఉన్న వాతావరణమ్మీదా... పరిసరాల మీదా, చుట్టూ ఉన్న వ్యక్తుల మీదా అపారమైన ప్రభావం, తమదైన ప్రభావాన్ని చూపుతారు... అది మంచైనా... చెడైనా...

★ ★ ★

ఎదురుగా ఉన్న పాతిల్లు సరికొత్తగా మారింది. కకావికలుగా ఉన్న కాంపౌండ్ అందమైన లాన్తో తోటగా మారిపోయింది...

ఆ తోటలో ఓ రెల్లు పాక వెలిసింది... ఆ రచయిత కొత్తింటికి మకాం మార్చేశాడు... అతనూ పనిమనిషి కుటుంబం మాత్రమే అంతింటికీ... పనిమనిషీ ఆమె భర్తా, వాళ్ళబ్బాయి సైదులు... వాడికి తబ్బూ వయసుంటుంది... పిల్లల్తో కలిసిపోయాడు...

ఆదివారం మొత్తం పిల్లలవీ నావీ బట్టలు అన్నీ కలిపి ఉతికి పెరట్లో ఆరేస్తున్నా... బృందా, తబ్బూ ఎదురింటబ్బాయి క్యారమ్స్ ఆడుతున్నారు పెరట్లోనే చాప పరుచుకుని...

పదిన్నరా పదకొండు ప్రాంతం... ఉన్నట్టుండి ఎదురింట్లోంచి వయొలీన్ స్వరం... అది కూడా నాకు చిరపరచిత రాగం... నాకు కన్నీరు మిగిల్చిన రాగం... కనీస స్వరజ్ఞానం కూడా లేని నాకు తెలిసిన నేను గుర్తుపట్టగల ఏకైక రాగం... 'కళావతి'.

'రతిసుఖసారే ఆ రాగంలో ఎంత బావుంటుందో' తెల్సా ఖయ్యూం నవ్వు ముఖంలో పూచిన రాగం. అచేతనంగా చేతిలో బొట్టుబొట్టుగా నీళ్ళు కార్తోన్న తడిచీరతో అలా నిల్చుండిపోయా... గేటు దగ్గర మనిషి కదలికతో మెలకువ లాంటి భావన.

బృంద... ఒళ్ళంతా చెవులై... లంగా మడత వేగంగా సాపు చేసుకుంటూ... కింది పెదవిని నోట్లోకి పీల్చుకుని... ఒక్కో అడుగూ... ఆ ఇంటివేపు వేస్తోంది...

"ఏయ్ మొద్దూ రావే ఇప్పుడు నువ్వాడాలి... రా... రా..." వెనక నుంచి తబుస్సుం అరుపు దాని చెవి చేరడం లేదు... ఏదో ట్రాన్స్‌లో ఉన్నట్టు ఆ ఇంట్లో కెళ్ళి పోయింది...

ఒక మాయామయ పొర లాంటి మంచుతత్త్వంలోకి లయమైపోయి అలుక్కుపోయి మాయమైపోయిన నీడలా బృంద... ఆరాగం స్రవిస్తోన్న ఇంట్లోకి...

చాలాసేపు నేనలాగే నుంచుండి పోయా... బృంద ఆ ఇంట్లోకి వెళ్ళిం తర్వాత

వయొలీన్ ఓ నిముషంపాటు ఆగింది. ఆగి మళ్ళీ మోగసాగింది... ఓ అరగంట గడచిపోయింది. బృంద రాలేదా ఇంట్లోంచి...

తబ్బూని లేపి... "వెళ్ళి బృందని పిల్చుకురా వెళ్ళు," అన్నా.

"వస్తుంది లేమా... ఎదురుగ్గానే కదా... నువు పో," అందది.

చీర సరిచేసుకుని విసుక్కుంటూ తబ్బు నెత్తిన మొట్టి ఆ ఇంటి ప్రాంగణంలో కడుగుపెట్టా. వయొలిన్ వినబడుతోనే ఉంది... ఈమాటే రాగమో తెలీదు...

నెమ్మదిగా ఒక్కో మెట్టూ ఎక్కుతూ సింహద్వారం ముందు నుంచుని తొంగిచూశా...

బృంద ఒళ్ళంతా చెవులై సోఫాలో కూచునుంది... అతను స్టూల్మీద కూచుని ఓ కాలు చాచి వయొలీన్ వాయిస్తో...

చిన్నగా దగ్గాను... అతను వయొలిన్ ఆపి నావేపు తలతిప్పి చూశాడు...

"సా... సారీ... పాప..." అంటూ బృందవేపు చెయ్యి చూపించా...

తెలుసన్నట్టు తలపంకించి... "వెళ్ళు నాన్నా... అమ్మ పిలుస్తోందిగా... మళ్ళీ వద్దువుగానీ... నీ ఇష్టం వచ్చినపుడు రా... వెళ్ళు," మెత్తగా వయొలీన్ మ్రోగినట్లుగా అన్నాడతను.

బృంద ఏదో తపస్సు భగ్నమైనట్టు చూసింది... బృందలో అంతటి ఏకాగ్రత నే చూసెరగను... ఆశ్చర్యమనిపించింది... కలలోలా కదిలి వచ్చింది. అతనికింకోసారి అపాలజీస్ చెప్పి బృంద చేయి పట్టుకుని వెనుతిరిగా, వయొలిన్నీ కమానునీ పెట్టెలో జాగ్రత్తగా నెమలీకల్ని పెట్టినట్టు పెట్టి నావేపు చూసి ఓ నవ్వు నవ్వాడు.

"బృందకు సంగీతంపట్ల గాఢమైన అనురక్తి ఉంది... అది తన రక్తంలో ఉందనుకుంటాను... బృంద నాకు ఎప్పుడో ఫ్రెండయిపోయింది. ఓనిమిషం క్రితం కాదు... ఎన్నాళ్ళో తెలీదు... తనని రానివ్వండి నాకూ బావుంటుంది," అన్నాడు.

అనుమానం, బ్రతుకు పట్ల భయం, ఒంటరితనం, ముఖ్యంగా పక్కింటి ముసలాడి దౌష్ట్యం నన్నెవర్నీ నమ్మనీయవు. మౌనంగా కదలబోతూ... బృంద నాచేయి వదిలితే ఆగిపోయా... అతనివేపు చురుగ్గా కదలి... అతనికి షేక్హ్యాండిచ్చి, "థాంక్యూ," అని గట్టిగా అరుస్తూ పరిగెత్తుకొచ్చింది బృంద...

★ ★ ★

తర్వాత బృంద రోజులో చాలా సమయం అతనింట్లోనే గడపసాగింది. నాకనుక్షణం ఏదో భయం... లాభంలేదు దీన్ని మొలకలోనే తుంచేయాలి... అని నిర్ణయించుకున్నా. అతనికి కరాఖండిగా చెప్పేయాలి. లేకపోతే లాభంలేదు. బృంద

ఉదయాన్నే అతనింట్లోకి వెళ్ళింది. వెళ్ళి గంటైంది... కోపంగా తల విదుల్చుకుని ముడివేసుకొని అతనింటికెళ్ళా.

గుమ్మంలోంచే 'కుయ్యి కుయ్యి' మని వయొలీన్... బృంద పక్కనే కూచుని అతను కుడికాలు చాచుకుని బృంద వేళ్ళు సరిచేస్తున్నాడు...

"గా... మా... అను... గా... మా," అని నేర్పుతున్నాడు...

నన్ను చూసి నవ్వుతూ... "రండి..." అంటూ సోఫాను సపోర్ట్‌గా తీసుకుని కష్టమ్మీద లేచి... సోఫాలో కూచున్నాడు.

ఎలా చెప్పాలో తెలియదు... ఏం చెప్పాలో తెలియదు...

"బృంద... బృంద మీకు తెలియదు షీ ఈజ్ నాటె నార్మల్ చై..." నేను పూర్తి చేయకముందే... ఆపండి అన్నట్టు చెయ్యి చూపి వారించాడతను... బృంద ఏమీ పట్టించుకోకుండా కుయ్ కుయ్‌మని వయొలిన్ని మోగిస్తోనే ఉంది. అతను సోఫాలోంచి లేచి నన్ను దాటుకుని వరండాలో కొచ్చాడు. అతను నడచి వచ్చినప్పుడు గమనించా... కొద్దిగా కుంటుతున్నాడు... ఇంట్లో కూడా షూ వేసుకొనే ఉండడం కాస్త వింతనిపించింది.

వరండాలోకొచ్చి గ్రిల్ కానుకుని... అతను నెమ్మదిగా మాట్లాడాడు.

"జీవితం ఎంత కర్కశమైందో నాకు తెలుసు... అలాగని జీవితాన్ని మనం అసహ్యించుకోడం... ప్చ్... నేను ఒప్పుకోను. బృంద నాకు ఓ ఊరట. మీకు ఎలా చెప్పాలో అర్థంకాదు... బృంద ఉన్నంతసేపూ నేను నావైకల్యాన్ని అస్సలు మననం కూడా చేసుకోను. మీకు తెలీదు ఎలా చెప్పాలి మీకు," అంటూ వండి కుడికాలి పైజమా నెమ్మదిగా పైకి మడుస్తూ లాగాడు.

కళ్ళు పెద్దవి చేసి చూస్తున్నా... మోకాలు పైవరకూ అతనికి కాలులేదు. కృత్రిమంగా అమర్చిన జైపూర్ లెగ్... అతనింకా ఏమో చెప్పబోతున్నాడు. అక్కడ్నుంచి నెమ్మది నెమ్మదిగా కదుల్తూ ఇంట్లోకి పరుగెత్తుతూ వచ్చేశా.

★ ★ ★

ఓ ఆరునెల్ల కాలం బృందలో చాలాచాలా మార్పులు తెచ్చింది. కంఠం స్థిరత్వాన్ని సంతరించుకుంది... ముఖంలో ఆలోచనా తత్త్వం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

ఇంతకుమునుపులా కాక 'అమ్మా ఇదేమిటీ? ఇదెందుకూ? ఇదిలాగెందు కుందీ?' లాంటి ప్రశ్నలు తరచూ వేస్తోంది. షహనాజ్‌గారి ప్రభావం బృందమీద బాగా కనిపిస్తోంది.

ఎదురింటి రచయిత విశ్వనాథ్‌గారి ప్రభావం కూడా...

అతను ఓ పాత వయొలీన్ తెచ్చిచ్చాడు బృందకు. సమయం దొరికినప్పుడల్లా

దాంతో గడుపుతోంది... చదువులో మాత్రం వెనకబాటుతనం పోలేదు. మధ్యలో ఓమాటు బృందని పిల్లల్తో చిన్న ప్రోగ్రాం ఉందని పిలుచుకెళ్ళాడాయన...

వెళ్ళొచ్చిన బృంద ముఖం వెలిగిపోయింది... "నేను వరవీణా వాయించా మా... తబ్బా తబ్బా నేను టీవీలో వస్తా... టీవీలో వస్తా" అని సంబరపడిపోయింది.

ఓ రోజు సాయంకాలం ఆఫీసునుంచి వస్తుండగా ఎదురింటి విశ్వనాథ్ పిలిచి, "రేపు దూరదర్శన్‌లో చిన్న ప్రోగ్రాం ఉంది పిల్లలది. పదింటికొస్తుంది. చూడండి మన బృంద కూడా ఉంటుందందులో," అన్జెప్పాడు.

తబ్బాకు అస్సలు నమ్మకం లేదు. ఒకటికి పదిమార్లడిగింది. "నిజంగానా? నిజమేనా మా," అంటూ. మర్నాట్రోజు ఉదయం పదింటికి టీవీ ముందు కూచున్నాం...

బృంద ఉగ్గబట్టుకుని కళ్ళార్పకుండా చూస్తోంది టీవీ ముందు కూచుని. ఎదురింటి సైదుల్ని పిలుచుకొచ్చుకుంది. తబ్బాకింకా నమ్మకం కలగలేదు.

పిల్లల ప్రోగ్రాం మొదలైంది. మొదట ఓ బృందం పాట ఒకటిపాడింది... దాంతర్వాత ఓ పదిమంది పిల్లలు వయొలీన్లు మోగిస్తూ వరవీణా గీతాన్ని పలికించారు... వెనక వరసలో బృంద చివ్వరెక్కడో ఉంది... గుర్తుపట్టడం కాస్త కష్టం.

పూర్తి ఏకాగ్రతతో వయొలీన్ పట్టుకునుంది... ఆ పెద్ద కళ్ళు దించుకుని కింది పెదవిని నోట్లోకి లాక్కుని...

"ఇదో అక్కా!" సైదులు గావుకేక పెట్టాడు.

"మా! మా! దో నేను నేనే మా... దో ఇక్కడా..." తనను తాను చూపించు కుంటోంది వేలు పెట్టి టీవీ స్క్రీన్మీద...

తబ్బా, "ఆయ్ బృందా... బృందా...." అన్చప్పట్లు కొడుతోంది...

నా కళ్ళ నిండిన నీళ్ళు ధారగా కారిపోతున్నాయి...

నాలోపలి ఖేదాన్ని యావత్తునీ కరిగించి నన్ను లోపల్నించీ క్షాళనం చేస్తూ...!!

✽